క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, నయీంనగర్, లష్కర్ సింగారం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌలి, నిజాంపుర, గోవిందరాజుల గుట్ట, మండిబజార్, ఎల్‌బీ.నగర్, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మహంకాళి దేవాలయం, రంగశాయిపేట, ప్రభుత్వ ఆస్పత్రి, కుమ్మరివాడ, తెలంగాణ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ కేసుల్లో రాజీకి లోక్ అదాలత్

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో వాహనం సీజ్ చేయబడిన వాహనదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో జరగనున్న లోక్ అదాలత్‌కు హాజరై కేసులను తొలగించుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు, వాహన పత్రాలు, లైసెన్స్, మైనర్ డ్రైవింగ్ కేసులకు ఎస్సెస్సీ మెమో లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలని వివరించారు. వివరాలకు 87125 44274లో సంప్రదించాలన్నారు.

లోక్‌సత్తా ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ప్రశాంత్



హసన్‌పర్తి: లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయ కర్తగా నగరంలోని ఆరెపల్లికి చెందిన సుంకరి ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్త పర్సా కోదండ రామారావు ప్రకటించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో ప్రశాంత్ సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించినట్లు పేర్కొన్నారు.

శ్వేతార్క ఆలయం మూసివేత



కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని ఆదివారం మధ్యాహ్నం ఆలయ అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసి తాళాలు వేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు తిరిగి తెరిచి శుద్ధి కార్యక్రమాలు చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ తెలిపారు.

ఆహార పొట్లాల పంపిణీ

హన్మకొండ: హనుమకొండలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గోకుల్‌నగర్‌లోకి వరద నీరు ప్రవహించి ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోకి వరద చేరడంతో నిత్యావసర వస్తువులు తడవడంతో వంట చేసుకోలేదు. ఈ క్రమంలో బాధితులకు మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు, కార్యకర్తలు ఆహార పొట్లాలు అందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వరంగల్ చౌరస్తా: పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడు మ్యాక సుధాకర్ రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన చిదురాల రామకృష్ణను బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, చైర్మన్, డిప్యూటీ తహసీల్దార్ పంతంగి భాస్కర్, స్రవంతి, వైట్ల రవి, వెల్దండి మధు, లక్ష్మణ్, పబ్బ సాంబరెడ్డి, శనిమల సుధాకర్ రెడ్డి, మూల లక్ష్మారెడ్డి, కర్ర జనార్దన్ రెడ్డి, మెతుకు సంజీవరెడ్డి, తక్కలపల్లి దేవేందర్ రావు, కుంజ భిక్షపతి, కదారి భాస్కర్ రెడ్డి, బొల్లం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ కార్యవర్గంపై అసంతృప్తి

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని ఇంపీరియల్ కాలనీ కార్యవర్గం సభ్యుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు స్థానికులు అంజిరెడ్డి, నాగేశ్వర్‌రావు, ఆరుట్ల ప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కాలనీ సమస్యలు, అభివృద్ధిని పట్టించుకోకుండా కమిటీ కార్యవర్గ సభ్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వారు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం



భట్టుపల్లి - ఖమ్మ బైపాస్ రోడ్డుపై నిలిచిన నీరు

- రహదారిపై నిలుస్తున్న నీరు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- భట్టుపల్లి – ఖమ్మం బైపాస్‌లో పొంచి ఉన్న ప్రమాదం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం భట్టుపల్లి – ఖమ్మం బైపాస్ రోడ్డుపై చెరువు నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న పెద్ద చెరువు వర్షపు నీటితో నిండి గండిపడి రహదారిపై పారుతోంది. అయితే, అక్కడ రోడ్డు పల్లంగా ఉండడంతో గుంతను తలపిస్తోంది. ఆ ప్రదేశంలో నీరు నిల్వ ఉండడంతో అది గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిత్యం ప్రమాదాలే..

భట్టుపల్లి ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ మార్గంలో వీధి లైట్లు లేక రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బైపాస్ కావడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో చెరువు పక్కన రోడ్డుపై నీటి నిల్వతో ఎక్కువగా ప్రమాదాలు జరుతున్నాయి. భారీ వాహనదారులు వేగంగా వెళ్తున్న క్రమంలో పక్కనే ప్రయాణిస్తున్న వారిపై నీరు ఎగిసిపడుతోంది. ఆ ప్రదేశంలో రోడ్డు నిర్మాణంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో వాహనదారులు, బాటసారులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

కల్వర్టు లేక వాహనదారులకు ఇక్కట్లు

- భట్టుపల్లి – దర్గా రోడ్డులో వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం



మత్తడి పోస్తున్న చెరువు



రోడ్డుపై పారుతున్న వరద

కాజీపేట అర్బన్: భట్టుపల్లి – దర్గా రోడ్డులో కల్వర్టు లేక ఇబ్బంది పడుతున్నామని కాజీపేట మండలం భట్టుపల్లి, దర్గా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భట్టుపల్లి – దర్గాకు వెళ్లే దారిలో ఉన్న దర్గా చెరువు వర్షాకాలంలో మత్తడి పోయడంతో ఆ నీరంతా రోడ్డుపై ప్రవహిస్తూ ఉంటుంది. వానొస్తే రోడ్డుపై వరద ప్రవాహం పెరిగి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

వర్షాకాలంలో ఇక్కట్లు

భట్టుపల్లి – దర్గా వెళ్లే దారిలో చెరువు మత్తడి వద్ద కల్వర్టు నిర్మిస్తే వర్షాకాలంలోనూ ప్రయాణం సులువుగా కొనసాగించే అవకాశం ఉంటుంది. కల్వర్టు లేకపోవడంతో వాహనదారులు, బాటసారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం భట్టుపల్లి నుంచి దర్గా మీదుగా నగరంలోని పలు స్కూళ్లు, కళాశాలలు, దర్గా, దర్గా పీఏసీఎస్, రైల్వే కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ముస్లింలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు, నిత్యావసర కోసం ప్రజలు ప్రయాణిస్తుంటారు. వర్షాకాలంలో రోడ్డుపై వరద ప్రవాహంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోతాయి. వరద ప్రవాహం తగ్గాలంటే సమయం పడుతోంది. ఈ క్రమంలో అత్యవసరంగా వెళ్లాల్సివస్తే కడిపికొండ నుంచి కాజీపేట మీదుగా నాలుగు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శం



దర్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి మార్గదర్శకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా జన్మదినాన్ని పురస్కరించుకుని (మిలాద్ ఉన్ నబీ) హనుమకొండ చౌరస్తా నుంచి హజ్రత్ అబ్దుల్ నబీషా సాహెబ్ దర్గా వరకు ముస్లింలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు ప్రవక్త జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దర్గాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రవక్త ఉపదేశాలు సమాజానికి శాశ్వత విలువలను అందిస్తాయని చెప్పారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, అజీజుల్లా, అబూబక్కర్, డిన్నా, రజాలీ, తబు పాల్గొన్నారు.

కోటలో మిలాద్ ఉన్ నబీ

ఖిలా వరంగల్: వరంగల్ మధ్యకోట మసీదు ఆవరణలో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దామోదర్ యాదవ్, మహమ్మద్ రఫీక్, గౌస్, సిరాజుద్దీన్, అష్రఫ్, ఆశు పాల్గొన్నారు.

11నుంచి సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వరంగల్ చౌరస్తా: భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ (యూ) నగర కమిటీ సమావేశాన్ని ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చరిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1952 వరకు సాగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎర్రజెండా నాయకత్వాన నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు ఐత నాగేష్, గణిపాక ఓదెలు, మహబూబ్ పాషా, మాలి ప్రభాకర్, మాలోత్ ప్రత్యూష, నర్సయ్య, రవీందర్ రాజేందర్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి నిలువెత్తు రూపం 'రావి'



నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం రావి నారాయణ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కొనియాడారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిరబోయిన కరుణాకర్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎంఏ.స్టాలిన్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, శంకర్‌నాయక్, వేల్పుల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న అశోక్

ఖిలా వరంగల్: నేత్రదానంతో మరొకరికి చూపును ప్రసాదించవచ్చని, ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోట పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో నేత్రదానంపై మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ దానంలో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దర్శిని, సావిత్రి, కవిత, సుమతి, పరంజ్యోతి, దీప, కళావతి, మణెమ్మ, నిర్మల, వరలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

పలు సంఘాల నూతన కార్యవర్గం ఎన్నిక



సంపత్ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు



రామన్నపేట: ఎన్నికైన పెన్షనర్ల కార్యవర్గం



హసన్‌పర్తి: కమిటీని ప్రకటిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ: ఆర్టీసీ హనుమకొండ డిపో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని హనుమకొండ గోకుల్‌నగర్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బంక సంపత్ యాదవ్, అధ్యక్షుడిగా ఎ.రవీందర్, కార్యదర్శిగా బీఎస్.చారి ఎన్నికయ్యారని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్, రీజియన్ కార్యదర్శి మాదారపు సాంబయ్య తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.నీరజ, మైకేల్ రాజు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎంఏ.కుమార్, ఎం.స్వప్న, సహాయ కార్యదర్శులుగా ఎస్.విమలాకర్, ఎంఆర్.కుమార్, ఉదయ్ కుమార్, కోశాధికారిగా బి.రాజేష్, కమిటీ సభ్యులుగా టీఎస్.మూర్తి, వి.రాజేష్, బి.రాజు, జి.సుందరయ్య, జి.రవి, ఎస్.శ్రీనివాస్, పి.రమేష్, టి.సుజాత, జి.రాధిక ఎన్నికయ్యారని వారు వివరించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, బంక సరళ దంపతులను సన్మానించారు.

పెన్షనర్ల సంఘం వరంగల్ కమిటీ ఎన్నిక

రామన్నపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ వరంగల్ నగర కమిటీని ఏవీవీ కళాశాలలో ఆదివారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు శ్రీరంగం, సోమయ్య తెలిపారు. బ్రాంచ్ అధ్యక్షుడిగా ఎండీ నిజామొద్దీన్, గౌరవ అధ్యక్షుడిగా గుండా స్వయం ప్రకాశ్, సహా అధ్యక్షుడిగా స్వరాజ్ బాబు, కార్యదర్శిగా గౌస్ ఇమామొద్దీన్, కోశాధికారిగా ముజసీర్ అహ్మద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా భవానీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఓంకారేశ్వర్, ప్రచార కార్యదర్శిగా రామలింగం, స్టేట్ కౌన్సిలర్లుగా సురేష్, శంకరయ్య, ఫక్రుద్దీన్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రామన్నపేట: గ్రేటర్ వరంగల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని రామన్నపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గంతో అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు.

వారాల సంఘం హసన్‌పర్తి శాఖ కార్యవర్గం

హసన్‌పర్తి: వారాల సంఘం హసన్‌పర్తి శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు నర్సింహారాములు, సంజీవ ప్రకటించారు. అధ్యక్షుడిగా పావుశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శిగా గుండమీది కృష్ణమోహన్, కోశాధికారిగా గుండమీది రాజేందర్, ఉపాధ్యక్షులుగా గుండమీది విజయ్‌మోహన్, కందుకూరి శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా కనపర్తి అశోక్, పావుశెట్టి ప్రవీణ్, జోన్ కౌన్సిలర్‌గా గంట నాగేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గౌరిశెట్టి సురేందర్, కొండమీది సంతోష్, గంట జలందర్, పాపిశెట్టి జితేందర్, నన్నంశెట్టి మహేష్, మొలుగూరి శారద, పాపిశెట్టి అభిలాష్, శ్రవణ్‌కుమార్, మహేష్, దాసరి బాలరాజు ఎన్నికైనట్లు వివరించారు. కాగా, ఎన్నికల పరిశీలకులుగా పావుశెట్టి వెంకటేశం, రవీందర్ వ్యవహరించారు.

రూ.10 నోటు @ రూ.2,516

- వేలంలో దక్కించుకున్న భక్తుడు

హన్మకొండ: రూ.10 కరెన్సీ నోటు విలువ రూ.2,516 ఏమిటని ఆశ్చర్యపోతున్నారా..? అవును ఇది నిజం. రూ.10 నోటును రూ.2,516కు వేలంపాటలో దక్కించుకున్నాడో భక్తుడు. వివరాల్లోకి వెళ్తే... హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని రామకృష్ణ సేవా సమితి భవనంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా రూ.10 విలువగల 21 నోట్లతో కూడిన మాలను వినాయకుడికి సమర్పించారు. నవరాత్రుల పాటు పూజలందుకున్న ఆ నోట్లను బంగారు నోట్లుగా భావిస్తారు. లడ్డూను చేజిక్కించుకోవడానికి భక్తులు వేలంలో ఎలా పోటీ పడతారో అలాగే, రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో రూ.10 నోట్ల కోసం భక్తులు అలాగే పోటీ పడ్డారు. మొత్తం 21 రూ.10 నోట్లకు వేలం నిర్వహించగా అత్యధికంగా ఒక నోటు రూ.2516, అత్యల్పంగా రూ.351 వేలంపాట పాడారు. హనుమకొండ అశోక కాలనీకి చెందిన ఎక్కటి కృష్ణారెడ్డి రూ.2,516కు బంగారు నోట్ దక్కించుకున్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని లెనిన్‌నగర్ కాలనీలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి చిప్ప వెంకటేశ్వర్లు, డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ కంచ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 600 కుటుంబాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు అశోక్‌బాబు, నరేష్, రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, సురేష్ బాబు రత్నాకర్, చిన్నాల సత్యనారాయణ, ప్రసాద్, కిరణ్, వేణు, అనిల్, గోరంట్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి అవార్డుల ప్రదానం



దినకర్‌కు అవార్డు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు



రవీందర్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్‌కు రోటరీ క్లబ్.. నేషన్ బిల్డర్ అవార్డు ప్రదానం చేసింది. హనుమకొండలోని వాగ్దేవి కళాశాలలో ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవంలో దినకర్‌కు అవార్డు అందజేసినట్లు రోటరీ క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి నరేష్ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న వెనిశెట్టి రవికుమార్

రవికుమార్‌కు జాతి నిర్మాత పురస్కారం

హన్మకొండ: జాతి నిర్మాత పురస్కారాన్ని నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ అందుకున్నారు.

నవరస కళా పురస్కారం ప్రదానం

హన్మకొండ కల్చరల్: శాంతి కృష్ణ సేవా సమితి వరంగల్ ఆధ్వర్యంలో సేవారత్న, కళాపోషకుడు డాక్టర్ ఆడెపు రవీందర్, జేబీ కల్చరల్ సొసైటీ నిర్వాహకుడు, కాస్ట్యూమ్, మేకప్ ఆర్టిస్ట్ జడల శివ, తదితరులకు కాకతీయ కళా వైభవం నవరస కళా పురస్కారాలను రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అందజేశారు.

సమాజ హితానికి పాటుపడాలి



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

రామన్నపేట: ప్రతిఒక్కరూ సమాజ హితం కోసం పాటుపడాలని వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ గుంటూరు వెంకట నారాయణ కోరారు. వాసవి క్లబ్ కాశిబుగ్గ ఆధ్వర్యంలో రీజియన్ చైర్మన్ అఫీషియల్ విజిట్ కార్యక్రమాన్ని పోచమ్మమైదాన్‌లోని జగన్నాథ వైట్‌హౌస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సరస్వతి పథకం కింద విద్యార్థులు పుల్లూరి నితిన్, నాగమల్ల అక్షర, నాగమల్ల వర్ధిని, పోకల అక్షితకు రూ.1,250 విలువగల చెక్కులను ప్రదానం చేశారు. అలాగే, జర్నలిస్టులను సత్కరించారు. గోవిందరాజుల గుట్ట ఆలయానికి కుర్చీలు, బెంచీలు వితరణ చేశారు. కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్, జోన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్, క్లబ్ అధ్యక్షులు యాదా మురళీధర్, కార్యదర్శి టి.వీరభద్రయ్య, కోశాధికారి రమణయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి



రామన్నపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదిగి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఏవీవీ విద్యాసంస్థల శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్ సూచించారు. నగరంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలలో 2008 – 09 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఏవీవీ విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ చందా విజయ్‌కుమార్, మాజీ హెచ్‌ఎం వాసుదేవులు, పూర్వ ఉపాధ్యాయులు వాసుదేవులు, వెంకటేశం, సంధ్యారాణి, నవీన్, వాసంతి, రమాదేవి, వీరేశలింగం పాల్గొన్నారు.

వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించిన ఎన్‌సీసీ కేడెట్లు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయాన్ని బిహార్, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం సందర్శించారు. మామునూర్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ –1 కార్యక్రమం 12రోజుల క్యాంపులో భాగంగా జాతీయ సమైక్యత శిబిరంలో మూడు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఓరుగల్లు నగరంలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించినట్లు ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ క్యాంపు డిప్యూటీ కమాండెట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు బొలిశెట్టి కమలాకర్‌కు సన్మానం

ఖిలా వరంగల్: రంగశాయిపేటకు చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు బొలిశెట్టి కమలాకర్ గతనెల 31న పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో వరంగల్ రంగశాయిపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో కమలాకర్‌ను రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రేమలతారెడ్డి, రవికుమార్, పాకాల కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, మన్నె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భీమారంలోని వసతి గృహంలో ఉచిత వైద్యశిబిరం

హసన్‌పర్తి: ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ (ఓబీసీ) ఆధ్వర్యంలో 55వ డివిజన్ భీమారంలోని బాలికల వసతి గృహంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా మాజీ చైర్మన్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇచ్చారు.

క్రిస్టియన్ కాలనీలో వృద్ధురాలి అదృశ్యం

ఖిలా వరంగల్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన క్రిస్టియన్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. క్రిస్టియన్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కొమ్మిగళ్ల సుగుణమ్మ ఈనెల నాలుగో తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో ఆమె కుమారుడు క్రాంతికుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ ఆదివారం తెలిపారు.